# అకాల వర్షం.. అపార నష్టం



హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లో కురిసిన వర్షానికి వరదలో కొట్టుకుపోతున్న ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులు
- మామిడి పంటలకు తీవ్రనష్టం

హుస్నాబాద్‌టౌన్, మే 6: మెట్టప్రాంతరైతాంగంపై ప్రకృతి కన్నెరచేస్తున్నది. పదిరోజుల్లో దాదాపు మూడుమార్లు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో చేతికివచ్చిన పంట వానపాలవుతున్నది. కోతలు కోసి అమ్ముకునేందుకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కు తీసుకువచ్చిన ధాన్యం ఆకాలవర్షాలతో వరదపాలైపోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టకపోవడంతో మార్కెట్ అంతా ధాన్యం రాశులతో నిండిపోయింది. పైగా మార్కెట్‌లో వర్షపునీరుపోయేందుకు ప్లాట్‌ఫామ్‌లు సక్రమంగా లేకపోవడంతో ధాన్యం పోసిన రాశుల కుప్పల మధ్యనే వర్షపు నీరునిలిచిపోతున్నది. మామిడి తోటలు సైతం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షం, ఈదురుగాలతో మామిడి తోటల్లోని మామిడి కాయలు అన్ని నేలపాలైనాయి. ఇలా ప్రకృతికన్నెరచేస్తుండటంతో రైతులు కన్నీరుమున్నీరుఅవుతున్నారు.

**వర్షానికి తడిసిన ధాన్యం**

మద్దూరు(ధూళిమిట్ట), మే 6 : మద్దూరు, ధూళిమిట్ట మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. కూటిగల్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోవడంతో పాటు వర్షపునీటిలో ధాన్యం కొట్టుకపోయింది. వివిధ గ్రామాల్లో రోడ్డకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో పాటు ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ట్రాక్టర్ సన్నవడ్లు కొట్టుకుపోయినయ్..**



పెద్ద పెద్ద రాళ్లుపడ్డాయి.. పరదాలమీద రాళ్లుసైతం పెట్టినం. కానీ గాలికికొట్టుకుపోయినయ్. ఒక్కపరద కూడా లేకుండాపోయింది. ఈనెల 1న తీసుకువచ్చినమ్.. నాలుగు ట్రిప్పుల వడ్లు తెచ్చినమ్.. కానీ వానతో ట్రాక్టర్ సన్నవడ్లు కొట్టుకు పోయినయ్.

-సంపత్ రైతు, హుస్నాబాద్



కూటిగల్‌లో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని తొలగిస్తున్న గ్రామస్తులు

## హామీల అమలుకు డబ్బు లేదనడం సిగ్గుచేటు

**బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్, మే 6 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి డబ్బు లేదనడం సిగ్గుచేటని, అలాంటప్పుడు చేతకానీ,అమలు కాని హామీలను ఎందుకు ఇచ్చారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 17నెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రూ.170 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రంలో ఎలాంటి పథకాలను అమలు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో నేడు తాగు, సాగునీరు అందిస్తున్నారన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని, 24 గంటల ఉచిత కరెంట్‌తో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



ఎమ్మెల్సీ యాదవరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గజ్వేల్, మే 6 : మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠామహోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారిని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీ యాదవరెడ్డిని శాలువతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పారిశుధ్యంపై అవగాహన



పారిశుధ్య కార్మికులకు సూచనలిస్తున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, మే 6 : మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో మురుగు కాల్వల శుభ్రం చేయడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంపై పారిశుధ్య కార్మికులకు కమిషనర్ గోల్కొండ నర్సయ్య అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి,పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ఇంటి యజమానులకు అవాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణలో ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

**సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

గజ్వేల్, మే 6 : ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కోరారు. మంగళవారం ప్రజ్ఞాపూర్ రాణే కంపెనీ వద్ద నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక ఐక్యత, మెరుగైన వేతన ఒప్పందం కోసం సీఐటీయూ కార్మిక సంఘాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న జాతీయ, రాష్ట్ర కార్మిక ఉద్యోగ సంఘాల కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె చేస్తుంటే బీఎంఎస్ సంఘం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, స్వామి, భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, మల్లయ్య, నర్సింహులు, రంగారెడ్డి పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌రూరల్, మే 6 : రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగు చేపట్టాలని ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోతారం(ఎస్)లో రైతు సంజీవరెడ్డి సాగు చేసిన అయిల్ పామ్‌ను అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించారు. వేసవిలో అయిల్‌పామ్‌పై తోటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇతర పంటలతో పోల్చితే అయిల్‌పామ్ లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏరియా అధికారి శంకర్, అయిల్‌పామ్ క్షేత్ర అధికారి రవళి, రైతులు పాల్గొన్నారు.

## 8న పుస్తకావిష్కరణ సభ

సిద్దిపేట టౌన్, మే 6 : మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత అలాజ్‌పూర్ కిషన్ రచించిన వచన కవితా సంపుటాలు వడిసెల, పేగు తెగిన పాట పుస్తకాల ఆవిష్కరణ సభ 8న ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, జర్నలిస్టు వేణుగోపాల్ ఆత్మీయ అతిథులుగా డాక్టర్ నందిని సిదారెడ్డి, శాసన మండలి సభ్యుడు, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ హాజరవుతారన్నారు.

## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్‌టౌన్, మే 6 : ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్ల శ్రీనివాస్‌యాదవ్ (50) వ్యాన్ మెకానిక్. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ ఎస్సైపై దాడి

మద్దూరు(ధూళిమిట్ట), మే 6 : విధి నిర్వాహణలో భాగంగా నాటుసారాయి తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ ఎస్సైపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపర్చిన ఘటన చెలిమెతండాలో మంగళవారం చోటు చేసుకుంది. మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల ఎక్సైజ్ ఎస్సై గుగులోతు సువర్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెలిమెతండాలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఫరీద్, కానిస్టేబుల్ రవి, శ్రీలత, నర్సింహులుతో తనిఖీలకు వెళ్లినట్లు తెలిపారు. తండాకు చెందిన పీర్యా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా, పక్క ఇంట్లో ముడావత్ సంతోశ్ ఎస్సై, సిబ్బందిని ఇష్టారీతిన దుర్భాషలాడుతూ సమీపంలో ఉన్న రాయిని తీసుకొని పైకివచ్చినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు అతడిని వారించగా, తిరిగి ఇటుకతో విసిరిగొట్టగా ఎక్సైజ్ ఎస్సై సువర్ణ ఎడమ చేతికి గాయమైనట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎస్సై ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోశ్‌పై కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహబూబ్ వివరించారు.

## దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

సిద్దిపేట టౌన్, మే 6 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి ఈ నెల 3న దోస్త్ నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు దోస్త్ సహాయ కేంద్రాన్నిలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు రూ. 225 చెల్లించి ఈ నెల 21 తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని దోస్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి , అకాడమిక్ కో-ఆర్డినేటర్ పిట్ల దాసు, అధ్యాపకులు శ్రద్ధానందం, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

## భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జవాబుదారితనం పెరగాలి

**సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్**




సమావేశంలో మాట్లాడుతున్న సంపాదకుడు, రచయిత కె. శ్రీనివాస్

ములుగు, మే 6 : మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జవాబుదారితనం పెరగాలని సీనియర్ సంపాదకుడు, రచయిత కె.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కేఎన్‌ఆర్ గార్డెన్‌లో గజ్వేల్ ప్రెస్‌క్లబ్ 25ఏండ్ల వేడుకల సందర్భంగా 'జర్నలిజం గత-వర్తమానం- భవిష్యత్' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం ప్రధాన మీడియా, సోషల్ మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జవాబుదారితనం లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా, డిజిటల్ మీడియా దారి తప్పకుండా ఉండాలంటే ప్రధాన మీడియా వాటికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. సోషల్ మీడియాకు చట్టబద్ధత కల్పించే దిశగా జర్నలిస్టు సంఘాలు కృషి చేయాలని కోరారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ జర్నలిజం పేరుతో కొన్ని అల్లరి మూకలు చేస్తున్న ఆగడాల కట్టడికి ప్రజలు, రాజకీయ నాయకులు కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృపాకర్‌రెడ్డి, మాజీ ఏ ఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, తహసీల్దార్ అరీఫా, ఎంపీడీవో స్వర్ణకుమార్, జర్నలిస్టులు ఎల్లం, నర్సింహులు, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, మే 6 : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోవాలని టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజు అన్నారు. మంగళవారం టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సందర్శించిన అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులనుద్దేశించి మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచామని వా టిని చదువుతూ ఉద్యోగాలకు సిద్ధం కావాలని సూచించారు.

## సైబర్ నేరగాళ్లకు చిక్కిన వ్యాపారి

దుబ్బాక, మే 6 : సైబర్ వలలో చిక్కిన ఓవ్యాపారి మోసపోయాడు. అత్యాశకు పోయి ఉన్న డబ్బులు పోగొట్టుకున్న ఆవ్యాపారి చివరకు పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం దుబ్బాక ఎస్సై గంగరాజు విలేకరులకు తెలిపారు. దుబ్బాక పట్టణానికి చెందిన మహ్మద్ సలాం అనే వ్యాపారికి తన సెల్‌ఫోన్‌లో అమీలియా అనే ఒక గ్రూప్ నుంచి ఒక లింకు వచ్చింది. దానిని క్లిక్ చేసి చూడగా, ఇందులో డబ్బులు పెట్టుబడి పెడితే స్వల్ప కాలంలో రెట్టింపు వస్తాయని వివరాలు ఇచ్చారు. దీంతో స్కానర్‌కు మొదట రూ.30 వేలు పంపగా, వెంటనే అతడికి రూ. 60 వేలు వచ్చాయి. మరోసారి రూ.30 వేలు పంపగా, మళ్లీ రూ. 60 వేలు వచ్చాయి. ఈ క్రమంలో ఆఫర్ ముగిసిపోతుందని బాధిత వ్యాపారి అత్యాశతో పలు దఫాలుగా రూ.1.75 లక్షలు సంబంధిత లింక్ స్కానర్‌కు పంపించాడు. ఇందుకు తిరిగి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో మోసపోయిన బాధిత వ్యాపారి 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. రూ. 7 వేలు ఫ్రీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అసమర్థతకు సీఎం వ్యాఖ్యలే నిదర్శనం



సమావేశంలో మాట్లాడుతున్న మంద యాదగిరి, నేతలు

మద్దూరు(ధూళిమిట్ట), మే 6 : సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తన అసమర్థతకు నిదర్శనమని బీఆర్‌ఎస్ ధూళిమిట్ట మండలాధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. మంగళవారం మండలంలోని బైరాన్‌పల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన చేతకాకనే సీఎం రేవంత్‌రెడ్డి పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ పరువు, ప్రతిష్టలను దేశ ప్రజలముందు అభాసుపాలుజేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. పదేండ్లలో దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి అధోగతికి తీసుకెళ్లుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు మోసపూరిత హామీలతో గద్దెనెక్కి, నేడు చేతకాని మాటలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పుట్ట వెంకట్రమణా రెడ్డి, చొప్పరిసాగర్, నాంపల్లి చంద్రశేఖర్, నాచగోని వెంకట్ గౌడ్, తాళ్లపల్లి భిక్షపతి, ఇమ్మడి సంజీవరెడ్డి, రాగుల సంపత్, దేవదాసు, దాసరి పురుషోత్తం, రాములు, నారదాసు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో..**

మిరుదొడ్డి, మే 6 : ఉద్యోగ ఉపాధ్యాయ ప్రయోజనాలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు చాలా బాధకరంగా ఉన్నాయని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాకం మల్లేశం అన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చే ఉచితాలను నిలిపివేసి ఇవ్వాలని ఉద్యోగులు అడగడం లేదని, ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందక పోవడంతో ఎంతో మంది మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వేతన సవరణను అమలు చేసి ఉద్యోగుల కుటుంబాలను ఆదుకొని రక్షణ కల్పించాలని కోరారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

నంగునూరు, మే 6 : మండల పరిధిలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జానయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి అడ్మిషన్లు పొందుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రతి గ్రూప్‌లో 40 సీట్ల చొప్పున 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో జయదేవ్ ఆర్యా

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

తొగుట,మే 6 : ఉమ్మడి మిరుదొడ్డి,అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని అందే ఖాజీపూర్ గ్రామాల్లో మంగళవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డీపీఎం రాజయ్య సందర్శించి వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలన చేశారు. ఏపీఎం రాజయ్య సీసీలు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో..**

అక్కన్నపేట, మే 6 : మండలంలోని గోవర్ధనగిరి, నందారం, రామవరం, అంతకపేట, జనగామ గ్రామాల్లో సెర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోళ్లలో వేగవంతం చేసి, ధాన్యాన్ని త్వరితగితన మిల్లులకు పంపించాలన్నారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజు, తిరుపతి, శివచరణ్ సింగ్, వీవోఏలు కవిత, సబిత, మంగాదేవి, అంజలి, అనిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యాన్ని తరలించాలి**

బెజ్జంకి, మే 6 : అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్యా ఐకేపీ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ధ్యానం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి ఉన్నారు.

## పంటమార్పిడితో అధిక దిగుబడి



తున్కిఖల్సాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వర్గల్, మే 6 : వేసిన పంటలే వేయకుండా పంటలను మార్చడం ద్వారా రైతులు అధికలాభాలు అర్జించవచ్చని సిద్దిపేట జిల్లా తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం అధికారిణి శ్రీజయ తెలిపారు. మంగళవారం వర్గల్ మండలం తన్కిఖల్సా రైతువేదికలో మన ఊరికే వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రానున్న వానాకాలం పంటల సాగుపద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా ఏడాదికొకసారి పంటలను మార్పిడి చేస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శేష శయన, ఏఈవోలు సునీ త,సుప్రజాతేజస్విని, భారతి, సంతోష్, ధర్మేందర్, రైతులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు రెండు బర్రెలు మృతి

చిన్నకోడూర్, మే 6 : చిన్నకోడూరు మండలంలోని మెట్టుపల్లిలో పిడుగు పాటుకు రెండు బర్రెలు మృతి చెందాయి. సోమవారం రాత్రి ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన రైతు బొస్సే చంద్రం యెక్క రెండు బర్రెలు పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్షా యాభై వేల నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ బాధితులను పరామర్శించారు.

**కోహెడలో..**

కోహెడ, మే 6 : మండలంలోని సోమారంపల్లికి చెందిన రాగుల మల్లేశ్ అనే రైతుకు చెందిన రూ. 70 వేల విలు వ చేసే పాడి గేదె పిడుగు పడి మృతిచెందింది. ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించి బాధితుడుని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కృష్ణ

గజ్వేల్, మే 6: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ అన్నారు. మంగళవారం ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహడ్, సింగారం గ్రామాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు దయానందరెడ్డి, రాజయ్య, పోచయ్య, రాజ్యం, రాజయ్య ఉప్పరి యాదగిరి, బాబు, కనకయ్య పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ నిందితుడి అరెస్టు

చేర్యాల, మే 6 : పట్టణంలోని చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నట్లు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.76,400 నగదు సీజ్ చేయడంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీను తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. పట్టణ సమీపంలోని చెరువు వద్ద ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నాడనే సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చేర్యాల పీఎస్ పోలీసుల చెరువు వద్దకు చేరుకొని చేర్యాల పట్టణానికి చెందిన కమల్ల శ్రీనివాస్, నర్ర చంద్రబాబు, నవీన్‌కుమార్, అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కూరపాటి శివప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆయనతో పాటు చేర్యాల ప్రొబేషనరీ ఎస్సై సమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన సమ్మర్‌క్యాంపు

బెజ్జంకి, మే 6 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు మంగళవారంతో ముగిసినట్లు ఎంఈవో మహతిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మర్ క్యాంపునకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చిందని, స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, డ్యాన్స్, డ్రాయింగ్, యోగ, వివిధ రకాల క్రీడలపై అవగాహన కల్పించామని వివరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నజీర్, రజనీశ్, రవీందర్, మణిశంకర్, రమేశ్, స్వరూప, సుధీర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కోహెడ మే 6 : బెజ్జంకి మండలం తోటపల్లి రిజర్వాయర్ కోసం మంగళవారం కలెక్టర్ మనుచౌదరిని కలిసి విజ్ఞప్తి చేశారు. తమ భూములను మళ్లీ తిరిగి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఇందులో బస్వరాజు శంకర్, భీనవేని రామస్వామి, భీనవేని ఐలయ్య, బొబ్బల మహేందర్‌రెడ్డి, బొబ్బల దామోదర్‌రెడ్డి, బారతవ్వ, కనుకయ్య, రమేశ్, శ్రీను, నరేందర్‌రెడ్డి, సుధాకర్, హరీశ్, మురారి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సాయం

చేర్యాల, మే 6 : మండలంలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌కు చెందిన నూనె తిరుపతి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపించిన రూ.5వేలను గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పర్వాటకం దుర్గారెడ్డి, దుర్గయ్య, లచ్చిన్నర్సు, మల్లయ్య, ఎగుర్ల మల్లయ్య, ప్రవీ ణ్, కాలనీవాసులు నూనె రమేశ్, వెం కయ్య, అంజయ్య, చిన్న నర్సయ్య తదితరులు ఉన్నారు.

**కొమురవెల్లిలో..**

కొమురవెల్లి, మే 6 : మండలంలోని కిష్టంపేటకు చెందిన కొమ్ముల మల్లయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత బొంగు రాంరెడ్డి పరామర్శించి, మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు కొత్తపల్లి రవీందర్‌రెడ్డి, కొడిశెల రాజు, జోగ్రిగల మల్లారెడ్డి పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



నెంటూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

వర్గల్, మే 6 : గ్రామాల్లో నివాసముంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వర్తిస్తాయమని వర్గల్ మండల మాజీ ఎంపీపీ నిమ్మరంగారెడ్డి తెలిపారు. బుధవారం నెంటూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పర్యవేక్షణలో పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా పూర్తిగా ఇండ్లు లేనివారికి పూరిగుడిసె, శిథిలావస్థకు చేరుకున్న పెంకుటిండ్లల్లో నివాసముంటున్న వారికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అర్హులని తెలిపారు. హౌసింగ్ పర్యవేక్షణ అధికారి సోహెల్, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, మాజీ ఉపసర్పంచ్ కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

అక్కన్నపేట, మే 6 : మండలంలోని కెప్టెన్ చౌడుతండా, గుబ్బడి, గోవర్ధనగిరి గ్రామాల్లో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తూ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సదస్సులకు బాధిత రైతులు హాజరై తమ భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సదస్సులను హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి పర్యావేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

హుస్నాబాద్ టౌన్, మే 6 : హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఉల్లెంగుల శివాజీ బాత్‌రూమ్ తలుపు ముట్టుకోగానే విద్యుత్‌షాకు తగిలింది. షాకు గురైన శివాజీ అరవడంతో శివాజీ తండ్రికొమురయ్య, సోదరి స్వప్న వచ్చి రక్షించే లోపు శివాజీ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై తోట మహేశ్ తెలిపారు.

## మైక్ సెట్ విరాళం

చేర్యాల, మే 6 : మండలంలోని ముస్త్యాల గ్రామ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ పెడుతల సంధ్య అమరేందర్‌రెడ్డి మైక్‌సెట్‌ను విరాళంగా బహూకరించారు. మంగళవారం మైక్‌సెట్‌ను మాజీ సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి ఆంజనేయ స్వామి ఆలయానికి అందజేశారు.

## రాయపోల్ తహసీల్దార్‌గా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ

రాయపోల్ మే 6 : రాయపోల్ మండల నూతన తహసీల్దార్‌గా కృష్ణమోహన్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. భూసేకరణ విభాగం నుంచి రాయపోల్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. అనంతరం కార్యాలయ భూ రికార్డులను ఆయన పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.